ఎమ్మెల్యే 'పల్లా' అరెస్ట్ అమానుషం

మాట్లాడుతున్న మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేట/దమ్మపేట, జూలై 1: నిరుద్యోగల సమస్యలపై గాంధీ ఆసుపత్రిలో నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థి నాయకుడు మోతీలాల్‌ను పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయడాన్ని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. అధికారం కోసం ఎన్నికల్లో అమలు సాధ్యం కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేవలం పదవులు కాపాడుకోవడం కోసం ఢిల్లీ టూర్లు, అందిన కాడికి దోచుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రాధాన్యతనిస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులను పరామర్శించే స్వేచ్ఛ లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు పరామర్శకు సెక్యూరిటీతో పంపడమేమిటని నిలదీశారు. వ్యక్తిగత ఈగోలకు పోకుండా వెంటనే సమస్యలపై విద్యార్థి సంఘం నేతలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి
అదనపు కలెక్టర్ వేణుగోపాల్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 1 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు దరఖాస్తుల రూపంలో అందించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి అన్నిశాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి సమస్యల దరఖాస్తులను స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం, జూలై 1: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అంతరాలయంలోని మూలవరులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ. 30లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక తొడుగులను సోమవారం అర్చకులు ధరింపజేశారు. స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి నిత్య కల్యాణం జరిపారు.

ఊరూరా 'రైతు భరోసా' సభలు

ఇల్లెందు రూరల్, జూలై 1: రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు మండలంలోని సుదిమళ్ల సొసైటీలో సోమవారం మహాజనసభ జరిగింది. ఏడీఏ వాసవీరాణి మాట్లాడుతూ.. రైతుల అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, సొసైటీ అధ్యక్షుడు రామకృష్ణ, డీఏవో బాబురావు, ఏవో సతీష్, డీసీవో కుమారి, డీసీసీబీ డైరెక్టర్లు జనగం కోటేశ్వరరావు, పులిగళ్ళ మాధవరావు పాల్గొన్నారు.

టేకులపల్లి:

టేకులపల్లి, జూలై 1: మండలంలోని సుక్కలబోడు రైతు వేదికలో బేతంపూడి సొసైటీ అధ్యక్షుడు లక్కినేని సురేందర్‌రావు అధ్యక్షతన మహాజన సభ జరిగింది. రైతుల అభిప్రాయాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు సేకరించారు. ఏడీఏ వాసవీరాణి, వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్, ఎంపీటీసీ మెంబర్ ఊకే రామకృష్ణ, సొసైటీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాసచౌదరి, కో-ఆపరేటివ్ మానిటరింగ్ ఆఫీసర్ మైకుమారి, డీసీసీబీ మేనేజర్ విజయ, ఏవో అన్నపూర్ణ, ఏఈవో విశాల పాల్గొన్నారు.

బూర్గంపహాడ్‌లో..

బూర్గంపాడు, జూలై 1: రైతు భరోసా పథకాన్ని ప్రతీ రైతుకు అందించాలని బూర్గంపాడు సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు అన్నారు. రైతు భరోసా పథకంపై రైతుల సూచనలు, సలహాలు నిమిత్తం సోమవారం బూర్గంపాడు సొసైటీ కార్యాలయంలో జరిగిన మహాజన సభలో జిల్లా సహకార అధికారి ఖుర్షీద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఏడీఏ తాతారావు, సొసైటీ ఉపాధ్యక్షుడు ఆవుల నాగిరెడ్డి, టీ సుజాత, డీసీసీబీ బూర్గంపాడు మేనేజర్ వసుమతి, మండల వ్యవసాయశాఖ అధికారి శంకర్, బూర్గంపాడు ఏఈవో ప్రసాద్, ఎంపీ బంజర్ ఏఈవో వైష్ణవి, సొసైటీ డైరెక్టర్లు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో బదిలీల జీవో విడుదల చేయాలి

దమ్మపేట, జూలై 1: గురుకులాల్లో ఉద్యోగుల బదిలీలు, ఉద్యోగోన్నతల జీవో విడుదల చేయాలని టీఈఏ శ్యామ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆయన దమ్మపేటలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. విద్యాశాఖ పరిధిలోని ఉపాధ్యాయుల బదిలీ పూర్తయిందని, ఇదే పద్ధతిలో గురుకుల ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని కోరారు. జీవో 317 వలన నష్టపోయిన వారికి న్యాయం చేయాలన్నారు.

ఎంపీటీసీని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

దుమ్ముగూడెం, జూలై 1: మండలంలోని నడికుడి ఎంపీటీసీ సోడే తిరుమలరావు ఇటీవల కాలుకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఇఫ్టూ నాయకుడికి నివాళి

ఇల్లెందు రూరల్, జూలై 1: సీపీఐ-ఎంఎల్ (న్యూడెమోక్రసీ) జిల్లా కమిటీ సభ్యుడు, ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు లంజపెల్లి విశ్వనాథం మృతిచెందారు. ఇల్లెందులోని పార్టీ కార్యాలయంలో సోమవారం సంతాప సభలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య నివాళి అర్పించారు. నాయకులు చంద్ర అరుణ, షేక్ యాకూబ్‌షావలి, పాయం వెంకన్న, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325755

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

లక్ష్యానికి మించి బొగ్గు ఉత్పత్తి

ఇల్లెందు రూరల్, జూలై 1: సింగరేణి ఇల్లెందు ఏరియాలో లక్ష్యానికి మించి బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం జాన్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ నెలలో నిర్దేశిత 2.77 లక్షల టన్నులకుగాను 3.30లక్షల టన్నులు (119శాతం) సాధించినట్లు పేర్కొన్నారు. 0.15 లక్షల టన్నులను రైల్వే, 0.54 లక్షల టన్నులను రోడ్డు, 2.40లక్షల టన్నులను ఆర్‌సీహెచ్‌పీ ద్వారా రవాణా చేశారన్నారు. ఇల్లెందు ఏరియాకు కేటాయించిన వార్షిక బొగ్గు లక్ష్యం 9.21లక్షల టన్నులకు గాను 10.06 లక్షల టన్నులు (109 శాతం) సాధించారన్నారు. ఉత్పత్తికి కృషి చేసిన అధికారులకు, సూపర్‌వైజర్లకు, యూనియన్ నాయకులకు, కార్మికులకు అభినందనలు ఆయన తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

భద్రాచలం: డాక్టర్ శ్రీనిధిని సత్కరిస్తున్న కొప్పుల మురళి, చర్ల: సత్యనారాయణపురం పీహెచ్‌సీలో కేక్ కట్‌చేస్తున్న వైద్యులు, చంద్రుగొండ: వైద్యులను సన్మానిస్తున్న వైద్యసిబ్బంది

బూర్గంపహాడ్: వైద్యులను సన్మానిస్తున్న నాయకులు

ఘనంగా డాక్టర్స్ డే

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్యులు కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. లయన్స్ క్లబ్, పాల్వంచ ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సేవా కేంద్రం, చేయూత ట్రస్టు, బీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధతో వైద్యులు కీలక పాత్ర పోషించి సంరక్షిస్తారని, అందుకే అమ్మ జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

- నమస్తే నెట్‌వర్క్

కొత్తగూడెం సింగరేణి: వైద్యులను సన్మానిస్తున్న సీఎంవో సుజాత

కరకగూడెం: డాక్టర్ మధును సన్మానిస్తున్న సిబ్బంది, రామవరం: వైద్యులను సన్మానిస్తున్న కౌన్సిలర్లు, పాల్వంచ: వైద్యులను సన్మానిస్తున్న బ్రహ్మకుమారిలు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అశ్వారావుపేట రూరల్, జూలై 1: మండలంలోని వినాయకపురం గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు వినాయకపురం, నారాయణపురం, గంగారం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

3న 'రైతు భరోసా' సదస్సు

పినపాక, జూలై 1: పీఏసీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పినపాక రైతువేదికలో రైతు భరోసా సదస్సు నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ వర్మ తెలిపారు. సోమవారం పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు భరోసా కోసం రైతులు తమ సూచనలు, సలహాలు అందజేయాలని కోరారు.

4న నారాయణపురంలో..

అశ్వారావుపేట రూరల్, జూలై 1: మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలోని రైతువేదికలో ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు రైతుభరోసా సదస్సు నిర్వహించనున్నట్లు నారాయణపురం సహకార పరపతి సంఘం కార్యదర్శి అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుభరోసా అమలుపై రైతుల సూచనలు, సలహాలు స్వీకరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు

జూలూరుపాడు, జూలై 1: మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో వరి(బీపీటీ 5204) రకం విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని సీఈవో రమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 25కిలోల వరి విత్తనాలు 143 బ్యాగులు వచ్చాయని ఒక్కొక్క బ్యాగు ధర రూ.1033 అని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, ఫోన్‌నెంబర్ తీసుకురావాలని సూచించారు.

జీవో 22ను అమలు చేయాలి

మాట్లాడుతున్న గూడెల్లి యాకయ్య

రామవరం, జూలై 1: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ జీవో 22ను అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు హక్కుల పరిరక్షణ సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు గూడెల్లి యాకయ్య డిమాండ్ చేశారు. సోమవారం రుద్రంపూర్ సివిల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల గేట్ మీటింగ్ నిర్వహించారు. సీఎండీ బలరాంను సంఘం ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. చిన్న, విజయ్, డి.శ్రీను, రవి, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ పూర్తి


శిక్షణ పొందిన తొలి బ్యాచ్‌తో సీడీపీవో తార

టేకులపల్లి, జూలై 1: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యపై టీచర్ల మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమం సోమవారం మండలంలోని బేతంపూడి పంచాయతీ వెంకట్యాతండాలో ముగిసింది. సీడీపీవో కెఎం.తార, ట్రైనర్లు కవిత, శారద, సూపర్‌వైజర్లు సక్కుబాయి, అనురాధ, లక్ష్మి, యశోద, నిర్మల, విజయకుమారి, కలిదబేగం, స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం
ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం అర్బన్, జూలై 1 : కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని, ప్రజల నమ్మకానికి అనుగుణంగా అభివృద్ధికి కృషి చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక శేషగిరి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.128.48 కోట్లు, విద్యానగర్‌కాలనీలో డ్రైనర్ల నిర్మాణానికి రూ.4 కోట్లు, ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి రూ.450 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఇతర అభివృద్ధి పనులకు మరో రూ.72.86 కోట్లు మంజూరు లభించిందన్నారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు అనిసెట్టిపల్లి జాతీయ రహదారి 930పీ నుంచి పాల్వంచ వరకు, సర్వారం, రామవరం, జగన్నాథపురం మీదుగా 30వ జాతీయ రహదారిని కలుపుతూ 25 కిలోమీటర్ల ఔటర్ రింగ్‌రోడ్డు రహదారి నిర్మాణానికి రూ.450 కోట్లు మంజూరయ్యాయని, ఇక జంట పట్టణాలకు ట్రాఫిక్ సమస్య పూర్తిగా తీరనుందన్నారు. భద్రాచలం పట్టణం వద్ద విజయవాడ - జగ్దల్పూర్ 30వ జాతీయ రహదారిని సుమారు 7 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు రూ.20 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్ ఎదురుగా పాదచారులు దాటేందుకు ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.64 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, అన్నవరపు కనకయ్య, డీసీసీబీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, యూసుఫ్, నేరెళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారిల సమస్యలు పరిష్కరిస్తాం
జాతీయ కమిషన్ సభ్యుడు వావా

మాట్లాడుతున్న సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ వావా, పక్కన కలెక్టర్, ఎస్పీ

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 1 (నమస్తే తెలంగాణ): సఫాయి కర్మచారిల సమస్యలను పరిష్కరిస్తామని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ వావా అన్నారు. సోమవారం జిల్లాకు విచ్చేసిన ఆయనకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, ఇతర అధికారులు, సఫాయి కర్మచారిల సంక్షేమ కోసం పాటుపడుతున్న పలు సంఘాల నాయకులు, ప్రతినిధులతో ఐడీవోసీలో సమావేశమయ్యారు. డాక్టర్ వావా మాట్లాడుతూ సమాజం ఆరోగ్యంగా ఉండాలని కష్టపడే సఫాయి కర్మచారిలకు ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థికసాయం, బ్యాంకు రుణాలు అందించాలని సూచించారు. ప్రతి మూడునెలలకు ఒకసారి వైద్యశిబిరాన్ని నిర్వహించి వారికి వైద్యసేవలు అందించాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైయిన్ శుభ్రపరిచే కార్మికుల విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జీతం పెంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరికీ కనీస వేతనాలు దక్కేలా చట్టాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సఫాయి కర్మచారిల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంవత్సరంలో నాలుగుసార్లు సఫాయి కర్మచారిలకు వైద్యపరీక్షలు నిర్వహించే విధంగా ప్రణాళిక చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సఫాయి కార్మికుల సంక్షేమానికి అన్ని మండలాల సబ్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుచందర్, డీఆర్‌డీవో విద్యాచందన, డీఎస్పీ రెహమాన్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, జిల్లా సంక్షేమాధికారి అనసూయ, జిల్లా లేబర్ ఆఫీసర్, జిల్లా వైద్యాధికారి లీడ్ బ్యాంక్ మేనేజర్ పాల్గొన్నారు.

రామచంద్రయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

మణుగూరు టౌన్, జూలై 1: పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం రామచంద్రయ్య నివాసానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వచ్చి 4వ తేదీన జరిగే దశదిన కర్మల కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పంపిన రూ.2లక్షలను కుటుంబ సభ్యులకు అందజేశారు. 462 గజాల స్థలంపై మంత్రి సూచన మేరకు జిల్లా కలెక్టర్ ప్రొసిడింగ్ కాపీలు అందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడిపూడి కోటేశ్వరరావు, సుబ్బారెడ్డి, గణేశ్‌రెడ్డి, గాండ్ల సురేశ్, పాతూరి వెంకన్న, దొడ్డపనేని మధు, పెనుగొండ సాంబశివరావు, కూచిపూడి బాబు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఐటీడీఏ ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, జూలై 1: పుట్టుకతోనే దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న చిన్నారి వైద్యం కోసం ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందించామని ఐటీడీఏ పీవో బీ రాహుల్ అన్నారు. సోమవారం తన చాంబర్‌లో సుజాతనగర్‌కు చెందిన మాలోత్ సౌమ్య వైద్యానికి సాయం అందించాలని కలెక్టర్ ఆదేశించడంతో ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.25వేలు చెక్కును అందజేశామన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, చిన్నారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీఎన్ఎస్ చట్టాలను రద్దు చేయాలి

భద్రాచలం, జూలై 1: బీఎన్ఎస్ చట్టాలను రద్దు చేయాలని భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు పట్టణంలోని జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుగు చైతన్య మాట్లాడుతూ పౌరహక్కులను కాలరాసే చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకు రావడం చాలా అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, ఆలిండియా లాయర్స్ యూనియన్, కాంగ్రెస్, బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

అశ్వారావుపేట, జూలై 1: ఆయిల్‌పాం రైతులకు డీసీసీబీ ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సీఈవో రెహమాన్ అన్నారు. మండలంలోని వినాయకపురంలోని ఓ ప్రైవేట్ భవనంలో సోమవారం జరిగిన ఆయిల్‌పాం రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్టిగేజ్ రుణాలను ఓడీఎఫ్ కింద మంజూరు చేస్తామని, రైతులు వినియోగించుకున్న నగదుకు మాత్రమే వడ్డీ సేకరిస్తామని అన్నారు. నాన్ మార్టిగేట్ తోటలకు రూ.2.5నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు అందించనున్నట్లు వివరించారు. డీసీసీబీ డైరెక్టర్, నారాయణపురం సొసైటీ అధ్యక్షుడు నిర్మల పుల్లారావు, నాబార్డు ఏజీఎం వేణుగోపాల్, అశ్వారావుపేట, దమ్మపేట బ్యాంక్ మేనేజర్లు, నారాయణపురం సొసైటీ సీఈవో, రైతులు పాల్గొన్నారు.

ఎర్ర కాలువ తూము పరిశీలన

అశ్వారావుపేట, జూలై 1: మండలంలోని వినాయకపురం సమీపంలో ఎర్ర కాలువ తూమును ఇరిగేషన్ ఏఈ కృష్ణ సోమవారం పరిశీలించారు. జనవరిలో కురిసిన భారీ వర్షాలకు తూము దెబ్బతినడంతో చెరువు నుంచి నీరు వృథాగా పోతుందని పలువురు రైతులు ఏఈ దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన ఏఈ చెరువు తూమును పరిశీలించి నష్టం అంచనా వేశారు. మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించి నిధులు మంజూరు అనంతరం వెంటనే పనులు ప్రారంభిస్తామని ఏఈ కృష్ణ తెలిపారు.

పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి

పాల్వంచ, జూలై 1: పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని హనుమాన్ యువజన సంఘం అధ్యక్షుడు ఆరుద్ర సత్యనారాయణ కోరారు. సోమవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఎన్నికలు జరిగేలా చొరవ చూపాలని కోరారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

ఆళ్లపల్లి, జూలై 1: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీవో, ఇన్‌చార్జి ఎంపీడీవో బత్తుల శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం ఆళ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఒకరు కోళ్ల ఫారం, మరో ఇద్దరు గుడిసెలు వేసుకున్నారు. ఈ విషయం ఎంపీడీవో దృష్టికి వెళ్ళడంతో వెంటనే స్పందించిన ఆయన ఎలాంటి అనుమతులు లేవని తెలుసుకొని వాటిని ఖాళీ చేయించారు. ఇకపై ఎవరైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

దుమ్ముగూడెం, జూలై 1: మండల కేంద్రమైన లక్ష్మీనగరం గ్రామంలో సోమవారం జేసీబీ సాయంతో కాలువ పక్క పిచ్చిమొక్కలను తొలగించి పారిశుధ్య పనులు చేపట్టారు. మండల కేంద్రంలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ముత్యాలరావు తెలిపారు. సైడ్ కాలువలను పూర్తిగా శుభ్రం చేసేందుకు పక్కనున్న షెడ్లను తొలగించడం జరుగుతుందని అన్నారు. దీంతో రోడ్డు వెంట చిరువ్యాపారాలు చేసే వారు వీధిన పడ్డారు.

గోదావరి వరదలపై దృష్టి సారించాలి
ఐటీడీఏ పీవో రాహుల్

వరదలపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జూలై 1: 2022లో వచ్చిన గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని ముంపు ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో బీ రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన గోదావరి వరద సమీక్షా సమావేశంలో ఏజెన్సీలోని వరద ముంపునకు గురయ్యే గ్రామాల్లో చేపట్టవలసిన మౌలిక సదుపాయాల గురించి ఆయన శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి ఏడాది వరద తాకిడి అధికంగా ఉంటుందని, అధికారులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏడు ముంపు మండలాల గ్రామాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వరదల సమయంలో అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని, వరదల సమయంలో ఉద్యోగులు సెలవులు తీసుకోవద్దన్నారు. మత్స్యశాఖ వారు బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో 24 గంటలు కరెంట్ సరఫరా, ఇతర సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ఆర్డీవో దామోదరరావు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఇరిగేషన్ ఈఈ రామప్రసాద్, డీఈ జే తిరుపతి, ఏఈ ఉపేందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాము, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, ఐటీడీఏ యూనిట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా కిడ్స్ అథ్లెటిక్స్ సెలక్షన్స్ ట్రయల్స్

కొత్తగూడెం టౌన్, జూలై 1 : జిల్లాలోని పాల్వంచ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 3వ తేదీ బుధవారం జిల్లా కిడ్స్ అథ్లెటిక్స్ సెలక్షన్స్ ట్రయల్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కే.మహీధర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు 8, 10, 12 సంవత్సరాల లోపు బాల బాలికలకు 50, 100, 300, 400, 600 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్ అంశాల్లో ఉంటాయన్నారు. ప్రతిభ చూపిన వారికి ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపుతామని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం కోచ్ నాగేందర్- 8328616737 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

అటవీ అధికారుల బెదిరింపులు మానుకోవాలి

- గొత్తికోయలకు సంక్షేమ పథకాలు అందించాలి
- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి, జిల్లా కార్యదర్శి రంగారెడ్డి
- గొత్తికోయల సమస్యలపై భద్రాద్రిలో నిరసన ర్యాలీ

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

భద్రాచలం, జూలై 1: పోడు సాగు చేసుకుంటున్న వారిపై అటవీ అధికారుల బెదిరింపులు మానుకోవాలని, వారిపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భద్రాచలంలో వారు పోడు సాగుదారులతో కలిసి బ్రిడ్జి సెంటర్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ, ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వమే పోడు సాగుదారులకు పట్టాలు ఇచ్చిందని, సాగుదారులను ట్రాక్టర్లతో దున్నరాదని, విద్యుత్ బోర్లు వాడొద్దని బెదిరిస్తూ గొత్తికోయల సాగును అడ్డుకోవడం సమంజసం కాదని విమర్శించారు. ములకలపల్లి మండలంలోని రాసన్నగుట్టలో అధికారులు జేసీబీలతో భూమిని లాక్కున్నారని, గతేడాది 70 ఎకరాలను బలవంతంగా గుంజుకున్నారని ఆరోపించారు. అర్హులైన వారందరికీ పోడు పట్టాలు ఇవ్వాలని, అటవీ అధికారుల దాడులు, బెదిరింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్, నూప భాస్కర్, కంగాల కల్లయ్య, పోతుగంట లక్ష్మణ్, తోడెం దుర్గమ్మ, మాచర్ల సత్యం, మధుసూదన్ రెడ్డి, నాయకులు సాయన్న, చరణ్, మునిగెల శివ ప్రశాంత్, పాలం చుక్కయ్య, సుజాత, శాంతక్క, మహేశ్వరి పాల్గొన్నారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో గ్రామస్తుడి హతం

కొత్తగూడెం క్రైం, జూలై 1 : ఇన్‌ఫార్మర్ నెపంతో గ్రామస్తుడిని హతమార్చిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లాలో సోమవారం వెలుగు చేసింది. నారాయణ్‌పూర్ జిల్లా నెలగూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గ్రామానికి చెందిన సన్ను ఉసెండి అనే వ్యక్తిని మావోయిస్టులు అపహరించి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే హత్య చేసినట్లు తెలుస్తోంది. మావోయిస్టు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్న నేపథ్యంలోనే ఉసెండికి ప్రజా కోర్టులో శిక్ష విధించినట్లు ఘటనా స్థలంలో ఒక లేఖను వదిలి వెళ్లారు.